# అనవసర ప్రసక్తి

పాలంకి వెంకటరామచంద్రమూర్తి

పురుషోత్తంగారికి ఒకేఒక్క కుమారుడు. అతగాడిపేరు రఘుపతి. అనర్సు చదువుతున్నాడు.

ఒకనాటి ఉదయం కామేశమనే ఆయన మరొక పెద్దమనిషిని వెంటబెట్టుకుని పురుషోత్తంగారి యింటికి వెళ్ళేరు.

'వీరెవరండీ?' అని ప్రశ్నించారు పురుషోత్తంగారు.

'మీరు కాబోయే వియ్యంకుడుగారు! వీరిది విశాఖపట్నం. మల్యాల వెంకటాచలంగారని మీరు వినే ఉంటారు—సుప్రసిద్ధ న్యాయవాదులు. వీరి అమ్మాయి శశిరేఖని మీ రఘుపతికి స్థిరపరుచుకోవాలన్న అభిప్రాయంతో వచ్చారు' అన్నాడు కామేశం.

'శుభమసు. అమ్మాయి జాతకం తెస్తే ఇప్పించమనండి' అన్నారు పురుషోత్తంగారు.

వెంకటాచలంగారు, 'పంపుతానండి. ఈలోగా అమ్మాయిని మీ చిన్నవాడు వచ్చి చూసుకునే ఏర్పాటు చేయించవలసిందని కోరుతున్నాను. పిల్ల చక్కనిదే అనుకోండి. ఐనా వధూవరులు ఒకళ్ళనొకళ్ళు చూసుకోడం మంచిది' అన్నారు.

'అలాగేనండి, జాతకం పంపించండి' అన్నారు పురుషోత్తంగారు మళ్ళీ.

వెంకటాచలంగారు 'ముద్దూ ముచ్చటా తీర్చవాళ్ళమే మేము. కట్నం, కానుకలూ సెలవిస్తే—'

'వాటికేమండీ, తమ ఇష్టానుసారం చెయ్యొచ్చు. జాతకం పంపించండిముందు' అన్నారు పురుషోత్తంగారు.

ఇంక తాము చెప్పవలసినదేమీ కనపడక కామేశంగారూ, వెంకటాచలంగారూ సెలవుపుచ్చుకు వెళ్ళిపోయారు.

లోపలనుంచి మహేశ్వరమ్మగారు వచ్చి భర్తతో 'వారు చెప్పదలచుకున్నదేదో చెప్పనివ్వక' 'జాతకం, జాతకం!' అంటూ మొదలెట్టేరేమిటండీ?' అంది.

'కట్నంకానుక లెక్కడికి పోతాయి? మొదట జాతకం నచ్చితే తక్కినవన్నీ నిర్ణయించుకోడం ఎంతసేపు?' అన్నారు పురుషోత్తంగారు.

వారంరోజులు గడవకుండా శశిరేఖ జాతకం పోస్టులో వచ్చి చేరింది. దాన్ని స్వయంగా పురుషోత్తంగారే పరిశీలించారు. 'ఈ జాతకం మంచిదికాదు' అన్నారు తుదకు.

'ఎందువల్ల?' అంది మహేశ్వరమ్మగారు. అదేసమయంలో సోమేశ్వరశాస్త్రిగారు వీథమ్మటపోతూ కనపడ్డారు. పురుషోత్తంగారు కేకవేసి పిలిచి, రప్పించారు. జాతకం అందించి, 'చిత్తగించండి ఒక్కసారి' అన్నారు.

'మంచికే జాతకం' అన్నారు శాస్త్రిగారు. పురుషోత్తంగారు, 'కాదు సరిగా చూడండి. ఈ జాతకురాలికి ఐదువతనం లేదన్న దోషం కనపడటం లేదా?'

శాస్త్రిగారు నిదానించి, 'గురుడు తులారాశియందు ఉండటంవల్ల కాబోలు మీకీ అనుమానం కలిగింది. కాని—'

ఆయన చెప్పబోయినదేదో వినకుండా పురుషోత్తంగారు చర్చకు దిగి, 'ఈ జాతకురాలికి విధవయోగం తప్ప'దని నిర్ణయించడానికి హేతువులు చూపించటం ప్రారంభించారు.

శాస్త్రిగారు అంతా విని, 'మీకంత అనుమానంగా ఉన్నప్పుడు, మరొక సంబంధమే చూసుకోండి. పెళ్ళికుమార్తెలకు కొదవ గనుకనా?' అంటూ లేచి వెళ్ళిపోయారు.

విశాఖపట్నంనుంచి వెంకటాచలంగారు మరొక జాబు వ్రాశారు. 'వరకట్నం మూడువేలివ్వదలచుకొన్నాం. వియ్యపరాలకూ, ఆడబడుచులకూ తలకొక నూట పదహార్లూ ఇస్తాం. మీ అభిప్రాయం తెలియపరచండి. మీ అబ్బాయిరాకకై ఎదురు చూస్తున్నాం.'

మహేశ్వరమ్మగారూ, ఆమె ఇద్దరు కుమార్తెలూ కూడా, 'మనం కోరకుండానే వారు ఇంత కట్నం, లాంఛనాలూ ఇస్తామంటూంటే, సందేహించడమేమిటి?' అన్నారు పురుషోత్తంగారితో. ఆయన 'మనకొక్కడే కొడుకు. మూడువేలొస్తున్నాయని మురిసిపోతున్నారేగాని, ఆ పిల్ల తనతో మృత్యుదేవతను వెంటబెట్టుకొస్తోందన్నమాట మరిచిపోతున్నారు!' అన్నాడు.

కామేశంగారు వచ్చి, 'వెంకటాచలం నాకు జాబు రాశాడండీ. మిమ్మల్ని కలుసుకుని మీ అభిప్రాయం తెలుసుకోమన్నాడు.'

పురుషోత్తంగారు, 'మావాడితో సంప్రదించాను. వాడు చదువు పూర్తిఅయి ఉద్యోగంలో ప్రవేశించేవరకూ పెళ్ళిమాట తలపెట్టవద్దు అన్నాడు.'

కామేశంగారు శశిరేఖకు రాజమహేంద్రవరంలోనే మరొక సంబంధం నిశ్చయించేశారు. ఆ కుటుంబంవారు పురుషోత్తంగారికి జ్ఞాతులే. 'ప్రధానం చేసుకుంటున్నాం, తాంబూలానికీ, ఆశీర్వచనానికీ రావలసిం'దంటూ భీమశంకరంగారు పురుషోత్తంగారి కుటుంబాన్ని కూడా పిలిచారు.

పురుషోత్తంగారు సంగతి విని నిర్విణ్ణుడై భార్యతో, "నాకు మన రఘుపతి వేరూ, వాళ్ళ బసవరాజు వేరూ కాదు. 'ఈ పిల్ల జాతకంలో ఈ దోషం ఉంది' అని వాళ్ళకి చెప్పిరావటం మన ధర్మం" అన్నాడు. మహేశ్వరమ్మ, 'చాలు, చాలు! ఎవరైనా వింటే తిట్టిపోస్తారు!' అని నోరు నొక్కింది.

ఏదో సాకుచెప్పి ప్రధానానికి వెళ్ళడం మానేసినా పురుషోత్తంగారి కుటుంబం గృహప్రవేశంనాడు భీమశంకరంగారింటికి వెళ్ళక తప్పిందికాదు. భీమశంకరంగారి భార్య సావిత్రమ్మ, మహేశ్వరమ్మతో, "మా వియ్యాలవారు చాలా మర్యాదస్థులు. అనుకున్నదానికంటె ఎక్కువే చేశారు" అంది. తనకు వారు పెట్టిన బనారసు పట్టుచీరను చూపించింది. ఆడబడుచులకూ తనకూ తలకొక నూటపదార్లేగాక ఒక్కొక్క గుజ్జుపుకాసుకూడా యిచ్చారుట!

మహేశ్వరమ్మ, ఆమె పెద్దకూతురు వెంకటలక్ష్మి, దాని చెల్లెలు శ్యామలా సావిత్రమ్మగారి అదృష్టానికి పైకి మెచ్చుకుంటూ లోలోన కుమిలిపోయారు. ఇంటికి వస్తూ దారిలో ఉండబట్టలేక పురుషోత్తంగారిని తిట్టిపోశారు.

దరిమిలాన రఘుపతికి సంబంధాలు చాలా

# ★ అనవసరప్రసక్తి ★

వచ్చాయి. ఒక్క వారంలో పదికుంది కన్యా ప్రదాతలు ఒకరికి తెలియకుండా ఒకరు వచ్చి పురుషోత్తంగారి దర్శనం చేశారు. ఆయన వెంకటాచలానికి చెప్పినట్లే 'పెండ్లి కూతురు జాతకాన్ని పంపించండి' అని అందరినీ కోరేరు.

సోమేశ్వర శాస్త్రి ఆయన కూర్చుని ఒక్కొక్క జాతకమే పరీక్షించారు. అన్నింటిలోకీ రాజేశ్వరి జాతకం ఒకటో రకమైనదని నిశ్చయించారు.

రఘుపతీ, మహేశ్వరమ్మగారూ రాజేశ్వరిని చూచి రావటానికి చీపురుపల్లి వెళ్ళేరు. పిల్ల నచ్చింది. "మూడు వేలు వరకట్నం, మూడు నూటపదార్లు లాంఛనాలూ పైవాళ్ళు ఇస్తామన్నవే. ఆ ప్రకారం మీరు జరుప దలచుకుంటే మాకు సమ్మతమే" అంది మహేశ్వరమ్మ.

రాజేశ్వరితండ్రి వెంకట్రామయ్య 'అమ్మా నాకంత తాహతు లేదు, కట్నం తప్పనిసరి గనుక వెయ్యినూటపదహార్లు వరునికిద్దామనుకున్నాను. నా ఉద్దేశానికీ మీరు చెప్పిన దానికీ చాలా వార ఉంది గనుక, నేను మరొక సంబంధం చూసుకోవలసిందే మరి' అన్నాడు.

పురుషోత్తంగారు సంగతి విని, 'నాకు జాతకం నచ్చింది. మనవాడికీ పిల్ల నచ్చింది. కట్నానికేం? చేసేసుకుందాం' అన్నాడు. 'మాకు నచ్చనక్కర్లే దన్నమాట!' అని కరవొచ్చారు వెంకటలక్ష్మి, శ్యామలాను. 'ఆడపిల్లల ముచ్చటలు మాత్రం తీరవద్దుటండీ? ఒకే ఒక్క తమ్ముడాయిరి!' అని హంగు చేసింది మహేశ్వరమ్మ.

ఆయన వాళ్ళగొడవకి చెముడు నటిస్తో, వెంకట్రామయ్యగారికి జాబు వ్రాశాడు. 'మీకు తోచినంతలో లాంఛనాలు కూడా జరిపించండి' అని ఆఖర్ని ఒక వాక్యం కూడా చేర్చాడు.




పోస్టేజీ అదనం. స్టాకు పరిమితంగా ఉంది. విలాసం ఇంగ్లీషులో వ్రాయండి:

KASHMIRI SHAWL HOUSE,
Durgiana (A. P. W.) Amritsar.


పెండ్లి పీటలమీద కూర్చున్న రాజేశ్వరి పురుషోత్తంగారికి కేవలం సౌభాగ్యదేవతలా కనపడింది. ఆమె సువాసినిగా డెబ్భైయేళ్ళు బ్రతుకుతుంది! పుత్ర పౌత్రాభివృద్ధీ, దుహిత దౌహిత్రాభివృద్ధీ—అన్నీ పట్టేయి ఆమె జాతకానికి! అదంతా తలుచుకుంటూ ఆయన వెయ్యినూటపదహార్లున్న కట్నపు పళ్ళేన్ని అందుకున్నాడు. హృదయం నిండుగా ఉండి, ఆ క్షణంలో ఆయనకు ఆ పళ్ళెం మూడు వేల నూటపదార్ల కన్న తూకంగానే కనపడింది.

ఆడపడుచులకూ వియ్యపురాలుకూ కలిపి నూటపదహారు చదివించాడు వెంకట్రామయ్యగారు. పుచ్చుకుందామా వద్దా అనుకుంటూనే చెయ్యిచాపింది మహేశ్వరమ్మ. 'ఆ వెంకటాచలంగారు కుంచాలతో ధాన్యం పోస్తానంటే వదిపట్టక, ఇక్కడకొచ్చి వట్టి గింజలు ఏరుకుంటున్నాం చూశారా?' అన్నట్టుగా ఆమే, కూతుళ్లూ పురుషోత్తంగారికేసి కొరకొరా చూశారు.

గృహప్రవేశానికొచ్చిన సావిత్రమ్మ 'గుజ్జుపుకాసు లివ్వలేదా?' అని అడిగింది. 'గుజ్జుపుకాసులూ లేవు, గాడిదకాసులూ లేవు!' అంటూ ఆమెతో అని, ఎందుకో ఆవైపువచ్చిన పురుషోత్తంగారికేసి, 'ఇదంతా మీ మూలానే!' అన్నట్టు చూసింది.

శశిరేఖ అత్తవారిఊరూ తన అత్తవారి ఊరూ ఒకటే అవడం రాజేశ్వరికి ప్రాణసంకటంగా పరిణమించింది. శశిరేఖ తెచ్చిన సారెలూ, చీరలూ సావిత్రమ్మగారు మహేశ్వరమ్మకూ, కూతుళ్లకూ చూపించక మానేది కాదు. తాను తెచ్చుకున్నవాటిని శశిరేఖ సారెతో పోల్చడం, 'ఎందుకూ? మాకూ దొరికింది దిక్కుమాలిన సంబంధం!' అని వీళ్ళు పిండుకోడం జరిగి రాజేశ్వరి బాధపడక తప్పేదికాదు.

ఒకనాడు రాజేశ్వరి కాఫీ తెచ్చి మామగారి ముందు పెట్టింది. 'ఏమమ్మా, అలాగున్నావు?' అన్నాడాయన.

'ఆ శశిరేఖనే చేసుకోలేకపోయారా మీ అబ్బాయికి?'

'ఏం? నిన్ను మళ్ళీ ఏమైనా అన్నారా?'

'సావిత్రమ్మగారికి పట్టిన అదృష్టం తమకి పట్టలేదని ఆ స్తమానూ బాధపడిపోతున్నారు.'

'సావిత్రమ్మకు పట్టబోయే దురవస్థ మనకు పట్టలేదని తెలిసినప్పుడు, ఇప్పుడన్నవాళ్ళే నిన్ను నెత్తిమీద కెక్కించుకుంటారు. చూస్తోండు!' అన్నారు పురుషోత్తంగారు.

పురుషోత్తంగారు భీమశంకరం ఎదురైనప్పుడల్లా బసవరాజు యోగక్షేమాలు పని కట్టుకుని అడిగి తెలుసుకునేవాడు. నాటి సాయంత్రం వాళ్ళవీథినే వెళ్ళటం తటస్థించి, గుమ్మంలో ఉన్న భీమశంకరాన్ని, 'మీవాడేడోయ్, కనపట్టం లేదు?' అన్నాడు.

'తలనొప్పిగా ఉందని పడుకున్నాడు' అన్నాడు భీమశంకరం.

'తలనొప్పి' అన్నమాట చెవిని పడటంతోనే 'అది సత్యవంతునికి వచ్చిన తలనొప్పి!' అనిపించి, పురుషోత్తంగారు బసవరాజు పడుండిఉన్న గదిలోకిపోయి, 'ఏమోయ్, ఎలాగుంది?' అని అడిగేడు.

'ఏమిటండి?' అన్నాడు బసవరాజు.

'తలనొప్పితో బాధపడుతున్నావన్నాడు మీ నాన్న.'

'నిన్నరాత్రి మూడో ఆటకు సినిమాకి వెళ్ళేను. నిద్రచాలక వచ్చింది. అంతేనండి' అన్నాడు బసవరాజు.

'ఎందుకైనా మంచిది. డాక్టరుకి కబురుపెట్టు' అన్నాడు పురుషోత్తంగారు.

రఘుపతికికూడా అప్పుడప్పుడు రుగ్మత చేస్తోండేది కాని పురుషోత్తంగారికేమీ ఆదుర్దా వుండేది కాదు. కాని బసవరాజు కేమాత్రం ఒళ్లు బాగుండలేదని తెలిసినా, ఆయనకి శశిరేఖ జాతకం కళ్ళకు కట్టినట్లయేది.

ఒకనాడు అక్కడకు వెళ్ళివచ్చిన మహేశ్వరమ్మను, 'ఏమే, బసవరాజు ఎలాగున్నాడు?' అని అడిగేడు.

'నిక్షేపంలాగున్నాడు. వాడి భార్యకు నెల తప్పిందిట!'

'ఐతే వాడికి గండంకూడా తప్పిందన్నమాట!'

'తప్పడానికి అసలు గండం అంటూ ఉంటేకదూ? మీ బుర్రలో శని ఉండటం వల్ల నిక్షేపంలాంటి ఆ పిల్ల జాతకంలో మీకు దోషం కనిపించింది! లక్షణమైన పిల్ల! చూస్తే ముచ్చటేస్తుంది! ఎందుకూ? మనకి ఉంది!'

ఆ మాట వినేసరికి పురుషోత్తంగారు ప్రళయరుద్రుడై 'నోరుముయ్!' అని ఒక గావుకేక పెట్టేడు. పెరట్లో ఉన్న రాజేశ్వరి, 'ఏమిటత్తా?' అంటూ లోనికి పరుగెత్తి వచ్చింది. ఆమెకేసి వేలెట్టి చూపుతో 'ఏం? ఇదిమాత్రం లక్షణమైన పిల్ల కాదూ?' అంటూ గర్జించాడు.

మహేశ్వరమ్మ నోరెత్తకుండా లోపలకి పోయింది. ఆయన పని ఉన్నవాడికిమల్లే చొక్కా తగిలించుకుని కోటిలింగాలవైపు నడిచిపోయాడు.

పోతూ, జరిగినదంతా నెమరుకు తెచ్చుకున్నాడు. 'నిజంగా నా బుర్రలోనేనా, శని ఉంటె? శశిరేఖ జాతకంలో కనపడ్డ

దోషం నా మెడకులో లేదా?' అని తర్కించుకుంటూ వెళ్ళేసరికి సోమేశ్వరశాస్త్రి ఎదురయాడు.

'శాస్త్రిగారూ, మా వాడికి పెళ్ళి సంబంధాలు వచ్చిన రోజుల్లో మీ కొక జాతకం చూపించాను జ్ఞాపకం ఉందా?'

'అప్పుడు చాలా చూపించారు. దేని మాట?'

'మొదట వచ్చిన జాతక మది. అందులో జాతకురాలికి వైధవ్యయోగం ఉందనుకున్నాం'

'ఔను...ఆ సంబంధం మీరు వదులుకున్నారుగా? ఇప్పుడెందుకు?' అన్నాడు శాస్త్రి.

"వదిలేశాం లెండి. కాని ఆ అమ్మాయిని వివాహం చేసుకున్న కుర్రవాణ్ణి నేనెరుగుదును. వాడికా పెళ్ళివల్ల ఏ ఆపదా మూడలేదని తెలిసి సంతోషిస్తున్నాననుకోండి. కాని 'ఆ అమ్మాయి కాయోగం ఇంతవరకూ ఎలా గతప్పింది?' అనుకుంటున్నాను." అన్నాడు పురుషోత్తం.

'దోషపరిహారాలకు మార్గాలున్నాయి. వైధవ్యయోగమున్న కన్యను ముందుగా ఒక అరటిచెట్టుకి పెండ్లిచేసి, ఆ చెట్టును నరికేసి తర్వాత నిశ్చయింపబడ్డ వరునికి పెండ్లి చెయ్యడం వినే ఉంటారు' అన్నాడు.

'విన్నాను. కాని ఈ విషయంలో అలాంటిది జరిగినట్టు లేదు.'

'ఒక్కొక్కప్పుడు వరుని జాతకంలో కూడా దోషం ఉండి వధువు జాతకంలోని దోషానికి విరుగుడు కావచ్చు! అన్నారు శాస్త్రిగారు మళ్ళీ.

'అంటే మీరు చెప్పేది, కళత్రనష్టయోగము ఉన్న వరునికి వైధవ్యయోగం ఉన్న వధువును పెండ్లిచేస్తే, 'ఉష్ణం ఉష్ణేన శీతలం' అన్నట్లౌతుందంటారు.'

'ఔను' అంటూ శాస్త్రిగారు వెళ్ళిపోయారు. పురుషోత్తంగారికి ఆ సంభాషణ మనశ్శాంతిని చేకూర్చింది. బసవరాజుకి జాతకంలో కళత్రనష్టయోగం ఉండి ఉండాలి!

ఆ రాత్రి ఆ విషయమే ఆలోచించుకుంటూ ఆయన నిద్రపోయాడు. మరునాటి ఉదయం, 'రాత్రి కల వచ్చిందర్రా' అన్నాడు. మహేశ్వరమ్మ, కూతుర్లూ 'ఏమిటండీ?' అని చెవులు వప్పగించి విన్నారు.

'వాళ్ల బసవయ్యకు జబ్బుచేసి ప్రాణం మీదకు వచ్చిందిట. వాడు పరున్న మంచం యొక్క కోళ్ళు ఉన్నట్టుండి యమదూతలుగా మారి ప్రత్యక్షమయారట భర్తకు చావు మూడిందని తెలియడంతోనే శశిరేఖ ఉరకటానికి నూతివద్దకు పరుగెత్తిందిట!—

ఆయనమాటకు అడ్డువచ్చి మహేశ్వరమ్మ, 'ఎలాగైనా శశిరేఖ మహాపతివ్రత' అని మెచ్చుకుంది. ఆయన నవ్వుతుండి, "మన కోడలుకంటే ఎక్కువ పతివ్రతేం కాదు! చెప్పేది వినక పానకంలో పుడకలా అడ్డువస్తావేం?" అన్నాడు.

'చెప్పనాన్నా' అంది వెంకటలక్ష్మి.

"శశిరేఖ నూతిలో ఉరకబోయేసరికి, 'రా, రా! మేం సిద్ధంగా ఉన్నాం!' అన్న కేకలు వినిపించాయి. ఆ కేకలు విని బసవరాజును చుట్టుముట్టిన యమదూతలు నలుగురూ, 'ఎవరది?' అంటూ వచ్చి నూతిలోకి తొంగిచూశారు. చూస్తోండగా నూతిలోంచి మరో నలుగురు యములాళ్ళు పైకివచ్చి, 'మీరెందుకు వచ్చారంటే, మీరెందుకు వచ్చా?' రని ప్రశ్నించుకుని, ఒకాళ్ళమాట ఒకాళ్ళు వినిపించుకోకుండా దొమ్మియుద్ధం మొదలెట్టి ఒకాళ్ళనొకాళ్ళు పొడుచుకు చచ్చిపోయారు!" అన్నాడు పురుషోత్తంగారు.

'చిత్రంగా నేవుంది!' అని మెచ్చుకుంది శ్యామల.

'దీని అర్థమేమిటో తెలిసిందా? ఆపిల్లకు వైధవ్యయోగం ఉండటంవల్లనే వాడికి ప్రాణంమీదకు వచ్చింది. వాడికి కళత్రనష్టయోగం ఉంది గనుకనే ఆమె నూతిలో పడి చావబోయింది. ఈ దుర్యోగాలు ఒకదానొకటి ప్రతిఘటించి, ఆ దంపతులిద్దరూ బాగా ఉండటం తటస్థించింది' అని పురుషోత్తంగారు తన జ్యోతిషం తప్పుగాదన్నట్లు తృప్తిగా చూశాడు.

'మీరు వెయ్యి చెప్పండి, లక్ష చెప్పండి. శశిరేఖను చేసుకోకపోవడమున్నంత తెలివితక్కువ మరొకటి లేదంటాను. నిజంగా ఆ పిల్లకి అలాంటి దోషమే ఉందనుకున్నా, ఆ బసవరాజు జాతకంలో ఉన్న దోషంలాంటిదే మన రఘుపతికీ ఉండి, వీడూ ఆ పిల్లతో సుఖంగానే ఉండి ఉండును!' అంది మహేశ్వరమ్మ

'ఆసి దౌర్భాగ్యురాలా! ఎంత మాటన్నావు?' అంటూ లేచాడు పురుషోత్తం. అంతలో లోపల వుండి వింటూన్న రాజేశ్వరి ప్రవేశించి, 'ఆ కళత్రనష్టయోగం మీ అబ్బాయి జాతకంలోనే ఉన్నట్లయితే ఇప్పుడు మించిపోయినదేదీ లేదు. నేను చచ్చిన పదమూడవనాడే మీ అబ్బాయికి మళ్ళీ వివాహం చేసి అప్పుడు ముద్దుముచ్చటలన్నీ తీర్చుకుందురుగాని!' అని చెప్పి లోపలకు చక్కాపోయింది.

మరుక్షణంలో కూరలసంచీ పుచ్చుకుని గుమ్మం ఎక్కుతూన్న రఘుపతి, లక్కబొమ్మలకు మల్లే నిలబడిపోయిన ఆ నలుగుర్నీ చూసి, 'ఏమిటి?' అన్నాడు. వాళ్ళెవరూ బదులు చెప్పకపోవడంవల్ల లోపలికి వెళ్ళి రాజేశ్వరితో 'ఏమిటే' అన్నాడు.

'వాళ్ళనే అడగండి!' అంది రాజేశ్వరి.

'అదే తెలుస్తుంది' అనుకుని ఊరుకున్నాడు రఘుపతి. కాని వాళ్ళెవరూ మళ్ళీ ఆ ప్రసక్తి తీసుకురావటానికి సాహసించకపోవడంవల్ల అతగాడికి ఆనాడు ఏమి జరిగిందో తెలియనేలేదు. ★

సిరోలిన్
మీ దగ్గుకి
కారణము
నిర్మూలము చేస్తుంది
— మీ దగ్గుటను
ఆపుట
మాత్రమే కాదు
సిరోలిన్ మీకు దగ్గును
కలిగించే అపాయకరమైన రోగ
క్రిములను నిర్మూలిస్తుంది
దగ్గుకు నిరపాయమైన కుటుంబ ఔషధము



స్థాపితము : 1920 సంగరం.
సమస్త చర్మవ్యాధులకు,
తెలుపు మచ్చలు వగైరాలకు చికిత్సా నిపుణులు.
కేట్లాగు, సలహా ఉచితము.
రెడ్డి & కో, (రిజిష్టర్డు)
గోపాలపురం. తూర్పు గోదావరి జిల్లా
(వయా) తణుకు.